ఇవి రోడ్లా.. చెరువులా?

- తటాకాలను తలపిస్తున్న అంతర్గత రహదారులు
- వారం రోజుల నుంచి ప్రయాణం చేయలేని దుస్థితి
- ఎంపీడీఓకు లేఖ రాసిన పెదారికట్ల ప్రజలు



పొదిలి: పెద్ద మసీదు వద్ద

కొనకనమిట్ల: ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ఓట్లేసి గెలిపించుకున్నందుకు తమను తామే నిందించుకుంటున్నారు. ఓ వైపు భారీ వర్షాలకు తోడు.. రోడ్లకు మర్మతులు చేయకుండా వదిలేయడంతో ఇప్పుడు అది శాపంగా మారింది. మండలంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలకు చెందిన అంతర్గత రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి వీధులన్నీ జలమయం అయ్యాయి. నీటి కుంటలను తలపిస్తున్న రోడ్లపై నడవటానికి ఇబ్బందుల ఎదుర్కొంటున్నామని ప్రజలు వాపోయారు. ముఖ్యంగా పెదారికట్ల, వెంగళపల్లి, గనివానిపాడు, నాగంపల్లి ఎస్సీ కాలనీల్లో రహదారులు అధ్వానంగా మారాయి. పెదారికట్ల గ్రామ ప్రజలు తాము పడుతున్న ఇబ్బందులను లేఖ ద్వారా మండల పరిషత్ అభివృద్ధి అధికారికి తెలియజేశారు. వారం రోజులుగా రోడ్డుపై మోకాటి లోతు నీళ్లు ఉండటం వలన చిన్న పిల్లలు, పెద్దవారు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డుపై నిలిచే నీరు బయటకి వెళ్లేలా చేసి నడవడానికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రధాన రహదారి ఇదేనా?

పొదిలి: రోడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పొదిలో ఉన్న ఒంగోలు–కర్నూలు ప్రధాన రహదారి నీటి కుంటలా మారింది. వర్షం కురిస్తే నీరంతా రోడ్డుమీదకు చేరి పలు చోట్ల నిల్వ ఉంటోంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆక్రమణలతో పాటు మురుగు కాలువలు లేక పోవటంతో ఈ దుస్థితి ఏర్పడింది. మార్కాపురం అడ్డ రోడ్డు వద్ద, ఎంపీడీఓ కార్యాలయం ఎదురు, పెద్దమసీదు వద్ద, చిన్న బస్టాండ్, శివాలయం దగ్గర వర్షం నీరు ఎక్కువగా నిల్వ ఉంటోంది. దీంతో రోడ్డు ఏదో అర్థం కాక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పెద్ద మసీదు వద్ద రోడ్డుకు గోతులు పడ్డాయి. వర్షాకాలం మొత్తం ఇదే పరిస్థితి ఉంటుందని.. వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కనీసం స్పందించకపోవడంతో సమస్య పరిష్కారం కలగా మిగులుతోంది. అవసరమైన నిధులు కేటాయించి రహదారి అభివృద్ధితో పాటు, మురుగు కాలువలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



పెదారికట్లలో వీధుల దుస్థితి



వెంగళపల్లిలో కుంటను తలపిస్తున్న రహదారి



పొదిలి: ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో..



పొదిలి: శివాలయం వద్ద



సలనూతలలో ఇలా..



పొదిలి: చిన్న బస్టాండ్‌లో..

క్లుప్తంగా

సబ్ జైలును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి భారతి

మార్కాపురం: స్థానిక సబ్ జైలును శనివారం జిల్లా జడ్జి ఎ. భారతి తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడి జైలులో వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. బెయిల్ లభించే కేసుల్లో ఖైదీలకు బెయిల్ వచ్చేందుకు సహకరించాలని సిబ్బందికి సూచించారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత నేర ప్రవృత్తిని వీడి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని సూచించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడవద్దని చెప్పారు. పలువురు న్యాయాధికారులు, కోర్టు సిబ్బంది, సబ్ జైలు సిబ్బంది ఉన్నారు.

టమోటా రైతులను ఆదుకోండి



టమోటా పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తర్లుపాడు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని తాడివారిపల్లిలో టమోటా రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతు సంఘం నాయకులు తెలిపారు. శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో తాడివారిపల్లిలో నీటమునిగి దెబ్బతిన్న టమోటా పంటను పరిశీలించారు. పంటలు నష్టపోయిన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఎకరాకు 50 వేల రూపాయలు తగ్గకుండా నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ప్రతాప్ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులున్నారు.

పంట పొలాల పరిశీలన

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను మండల వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి శనివారం పరిశీలించారు. గొట్లగట్టు, పాతపాడు, నాయుడుపేట గ్రామాల్లో సాగు చేసిన మినుము, అలసంద, మిర్చి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వారం పాటు విస్తారంగా కురిసిన వర్షాలకు పలు రకాల పంట పొలాలు నీట మునిగాయని ఏఓ తెలిపారు. ఎక్కువగా అలసంద, మినుము పంటలతో పాటు లేత పొగాకు చేలు నీట మునిగాయని రైతులు ఏఓ దృష్టికి తెచ్చారు. జరిగిన నష్టం గురించి జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి



వెండి గిన్నెలను అందిస్తున్న శివరామకృష్ణ దంపతులు

మార్కాపురం: తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి సయ్యద్ జావీద్ అన్వర్ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం రుణాలను రీషెడ్యూల్ చేస్తూ రబీ సీజన్‌కు కొత్త రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

చెన్నకేశవునికి రెండు వెండి గిన్నెల సమర్పణ

మార్కాపురం టౌన్: పట్టణంలోని భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి విశ్రాంత తహసీల్దార్ శివరామకృష్ణ దంపతులు శనివారం రెండు వెండి గిన్నెలను బహూకరించారు. స్వామివారి నిత్య కైంకర్యాల్లో వెండి పాత్రలను ఉపయోగించాలని కోరారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మార్కాపురం రూరల్: మండలంలోని రాయవరం గ్రామ పొలాల్లో శనివారం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద 1450 రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై అంకమరావు తెలిపారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

తర్లుపాడు: గత 5 రోజులుగా మండలంలోని సీతానాగులవరం, గొల్లపల్లి, చెన్నారెడ్డిపల్లి, తర్లుపాడులో కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న మిరప, కంది, పొగాకు, మినుము పంటలను ఏడీఏ బాలజీ నాయక్ అధికారులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, వీఏఏఎస్‌లు విష్ణు, పూర్ణ శంకర్, సావిత్రి, రైతులు పాల్గొన్నారు.

పొదిలి: పొగ నారుమళ్లలో నీరు నిల్వ కుండా వెంటనే బయటకు పంపే ఏర్పాట్లు చేలని వేలం అధికారి గిరిరాజ్ కుమార్ తెలిపారు. వేలం పరిధిలో రైతులు సుమారు 45 హెక్టార్లలో పొగనారుమళ్ళు సాగుచేసినట్లు శనివారం తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

కొమరోలు: మండల కేంద్రం కొమరోలులో సీసీ రహదారుల నిర్మాణానికి గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ముత్తుముల అశోక్‌రెడ్డి శనివారం భూమిపూజ చేశారు. కొమరోలు పంచాయతీలో రూ.80 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రహదారుల నిర్మాణానికి పల్లెపండగ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భూమి పూజలో పాల్గొని శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ మస్తాన్‌వలి, పంచాయతీరాజ్ ఏఈ వీరయ్య, ఏపీఓ మహాలక్ష్మి పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తర్లుపాడు: స్థానిక బీసీ కాలనీలో 36 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డుకు ఎంపీపీ భూలక్ష్మి, సర్పంచ్ పి. వరాలు, ఎంపీటీసీ అంకమ్మ శనివారం శంకుస్థాపన చేశారు. ప్రతి వీధికి సీసీ రోడ్డు వేసేందుకు ప్రభుత్వం నిధులు సమకూర్చిందని సర్పంచ్ తెలిపారు. ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, పీఏస్ సుధాకర్, వెంకటయ్య, కాశంగి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించండి

మార్కాపురం: మార్కాపురం చెరువులో అక్రమ కట్టడాలను తొలగించాలని ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మదిరె రంగసాయిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మార్కాపురం చెరువుకట్ట పరిశీలించి మాట్లాడారు. 500 ఎకరాల్లో విస్తరించిన చెరువు నేడు ఆక్రమణలకు గురై విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. రేడియో స్టేషన్ సమీపంలో ఉన్న అలుగు పూర్తిగా ఆక్రమణకు గురైందని, ఈ అక్రమ కట్టడాలు.. చిన్నమసీదు ఉన్న తూము వరకూ విస్తరించి ఉన్నాయన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మార్కాపురం నియోజకవర్గం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని గొట్లగట్టు పంచాయతీ నాయుడుపేట ఎస్సీ కాలనీ, పెదారికట్ల, సిద్ధవరంలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, సర్పంచ్ పి.సుఖ్‌దేవ్, టీడీపీ నాయకులు పొదిలి తిరుపతయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



పాఠశాలలో వంటను పరిశీలిస్తున్న జడ్జిలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయవాది పోలయ్య

గిద్దలూరు రూరల్: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల గదులతో పాటు వంట చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా మంచి ఆహారం పెట్టాలని సూచించారు. అనంతరం సబ్ జైలులోని ఖైదీలతో ఆమె మాట్లాడారు. జైలులో ఖైదీలకు ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులపై విచారణ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకున్న ఖైదీలతో బాధ్యతగా ప్రవర్తించాలని జైలు సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఉచితంగా న్యాయసేవలు పొందే అవకాశాలున్నాయని వివరించారు. గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాధానమ్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, న్యాయవాదులు రవిప్రకాష్, పిచ్చయ్య యాదవ్, ఫాజిల్, పారాలీగల్ వలంటీర్ మధుసూదనరావు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

బేస్తవారిపేట: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రాకారం అందించాలని మండల న్యాయసేవాధికార సంస్థ ప్యానల్ న్యాయవాది చల్లగాలి పోలయ్య అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌ను తనిఖీ చేశారు. వండిన ఆహారాన్ని రుచి చూశారు. విద్యార్థినులు ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. 1500 టోల్‌ఫ్రీకి సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి



రోడ్డు కనిపించకుండా పెరిగిన పిచ్చిమొక్కలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే రహదారిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో భక్తుల రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. రాజానగర్ నుంచి నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డులో పిచ్చిమొక్కలు పెద్దగా పెరిగిపోవడంతో రహదారి కనిపించకుండా పూడుకు పోయిందని భక్తులు వాపోతున్నారు. శనివారం రోజు భక్తులు వాహనాలపై ఈ మార్గం మీదుగా ఎక్కువగా వెళ్తుంటారు. పిచ్చిమొక్కలు పెరగడంతో రోడ్డు కుంచించుకుపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత నగర పంచాయతీ అధికారులు స్పందించి ఆలయానికి సమీపంలోని రోడ్డుపై ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పాఠశాలల తనిఖీ

కొనకనమిట్ల: మండలంలోని వింజవర్తిపాడు హిందూ ప్రాథమిక పాఠశాల, వెలుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం ఎంఈఓ–2 బి.నరసింహారావు పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ కిరణ్ పాల్గొన్నారు.

ఇంట్లో నిల్వ ఉంచిన 42 వడ్ల బస్తాల అపహరణ



వడ్ల బస్తాలు మాయమైంది ఈ ఇంటిలోనే..

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని ఓ గృహంలో నిల్వ ఉంచిన 42 వడ్ల బస్తాలు అపహరించుకెళ్లిన సంఘటన శనివారం వెలుగు చూసింది. వివరాలు.. అర్ధవీడుకు చెందిన షేక్ ఇక్బాల్ వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నాడు. తన వరి పొలంలో పండిన 42 బస్తాల వడ్లను కొంతకాలం నిల్వ ఉంచి ఆ తర్వాత మరపట్టించుకుందామనుకొని నాలుగైదు నెలల క్రిత అర్బన్ కాలనీలో ఉన్న తన చెల్లెలి గృహంలో ఉంచి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. శుక్రవారం కంభం వచ్చిన ఆయన ఇంటి వద్దకు వెళ్లి చూడగా తలుపునకు వేసి ఉన్న తాళాలు పగలగొట్టి ఉండటం చూసి లోపలికి వెళ్లాడు. లోపల ఉండాల్సిన వడ్ల బస్తాలు మాయమైనట్లు గుర్తించాడు. తెలిసిన వ్యక్తులే దొంగిలించారా లేదా ఇతరలు దొంగిలించుకొని తీసుకెళ్లారో అర్థం కావడం లేదని బాధితుడు వాపోయాడు.

చెవిలో పువ్వుతో నిరసన



చెవిలో పువ్వుతో మున్సిపల్ కార్మికుల నిరసన

మార్కాపురం టౌన్: చెవిలో పువ్వు పెట్టుకుని మున్సిపల్ కార్మికులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వినూత్నంగా ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోనికి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్‌వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే దీక్షల్లో భాగంగా శనివారం కార్మికులు చెవిలో పువ్వుతో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ మాట్లాడుతూ అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోనికి తీసుకోవాలని, లేంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే అధికారులు ఇబ్బందులు పడతారన్నారు. వెంకటయ్య, సుబ్బరాయుడు, సలాం, రమణ, యూసఫ్, షబ్బీర్, శ్రీను, నాగేంద్ర, ఇమాంసా తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల ధర్నా



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వ్యాపారులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో గత 20 సంవత్సరాలుగా రోడ్డుకు ఒక వైపున బంకులు పెట్టుకుని జీవనం సాగిస్తున్న తమ జీవనాధారమైన షాపులను తొలగించాలని నోటీసులు ఇవ్వడం అన్యాయమని, నోటీసులను ఉపసంహరించుకోవాలని చిరువ్యాపారులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. తాము వ్యాపారాలు చేసుకుంటున్న బంకులను తొలగిస్తే కుటుంబ పోషణ కష్టమని వారన్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం నేత గాలి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు.

పశ్చిమంలో కొనసాగుతున్న వర్షాలు



వర్షంతో నిర్మానుష్యంగా మారిన మార్కాపురం మెయిన్ రోడ్డు



ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ



కంభం రోడ్డులో నిలిచిన నీరు



పేరారెడ్డిపల్లిలో ముంపునకు గురైన పంట పొలాలు



సలనూతలలో నీట మునిగిన పైరులో రైతు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో అల్పపీడనం కారణంగా అధిక వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం మార్కాపురం నియోజకవర్గంలోని కొనకనమిట్లలో 65.6 మి.మీ, గిద్దలూరులో 34.2 మి.మీ, బేస్తవారిపేటలో 29 మి.మీ, మార్కాపురంలో 29 మి.మీ, పొదిలిలో 21.6 మి.మీ, రాచర్లలో 20.3 మి.మీ, కొమరోలులో 19.2 మి.మీ, కంభంలో 16.8 మి.మీ, పుల్లలచెరువులో 15.8 మి.మీ, పెద్దారవీడులో 14.2 మి.మీ, తర్లుపాడులో 13 మి.మీ, దోర్నాలలో 9.6 మి.మీ, అర్ధవీడులో 9.4 మి.మీ, త్రిపురాంతకంలో 8.8 మి.మీ, యర్రగొండపాలెంలో 7.4 మి.మీ వర్షం కురిసింది. దీనితో పశ్చిమ ప్రకాశంలో ప్రవహిస్తున్న గుండ్లకమ్మ, ఉప్పువాగు, తీగలేరు, దువ్వలేరు, సగిలేరు తదితర వాగులన్నీ వరద నీటితో ప్రవహిస్తున్నాయి. మార్కాపురం, వేములకోట చెరువులకు వరద నీరు చేరుతోంది. శనివారం కురిసిన వర్షానికి పత్తి, మిరప, పొగాకు, కంది చేలల్లో వర్షపునీరు నిలవడంతో కాయకుళ్లు, తెగుళ్లు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కాపురం పట్టణంలోని జగనన్న కాలనీ, రాజ్యలక్ష్మి కాలనీ, భగత్‌సింగ్ కాలనీ, చెన్నరాయుడుపల్లి, ఇందిరమ్మ కాలనీల్లో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచింది.

కొనకనమిట్ల: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా జోరు వాన కురుస్తోంది. శనివారం మళ్లీ భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం వరకు కొనకనమిట్ల మండలంలో 35 మి. మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో గొట్లగట్టు విద్యార్థుల ప్రతిభ



రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కొనకనమిట్ల: ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శనివారం పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. లక్ష్మి కల్పన, సీహెచ్ మహేశ్వరి, యు.చంద్రలిఖిత, ఎం.గురులక్ష్మి, కె.జస్సీ కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారని అన్నారు. వారిలో మంచి ప్రతిభ కనబరిచిన రాజారపు లక్ష్మి కల్పన జాతీయ స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైందని చెప్పారు. డిసెంబరు 25 నుంచి 30 వరకు బీహార్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో లక్ష్మి కల్పన పాల్గొంటుందని అన్నారు. ఎడీ బాలగురవయ్యను, క్రీడాకారులను కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.